1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | అక్టోబర్ 10, 2023 | www.navatelangana.com

నీలా క్యాంపులో సంచరిస్తున్న నెమలి

నవతెలంగాణ-రెంజల్

అడవులలో తల దాచుకోవాల్సిన నెమలి గత కొన్ని సంవత్సరాలుగా నీలా క్యాంపులో తలదాచుకోవడం విశేషం. నీలా క్యాంప్ గ్రామంలో పంట పొలాలలో తిరుగుతూ సాయంత్రానికి గ్రామంలోకి వస్తుందని పేర్కొన్నారు. కొందరు గ్రామస్తులు వాటికి గింజలు వేయడం పరిపాటి అయింది. గ్రామ శివారులోని చెట్ల మధ్యలో ఉంటూ, అప్పుడప్పుడు నెమలి పురివిప్పి నాట్యం చేస్తుందని తెలిపారు.


పరిసరాల్లో సంచరిస్తున్న నెమలి

ప్రజావాణికి 140 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 140 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీపీఓ జయసుధ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మోగిన ఎన్నికల నగారా

- అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 30న పోలింగ్
- డిసెంబర్ 3న ఫలితాలు
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

నవతెలంగాణ-నిజామాబాద్

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. నవంబర్ 3వ తేదీనా నోటిఫికేషన్ విడుదల చేయనుండగా.. 30వ తేదీన పోలింగ్, డిసెంబర్ 3న ఫలితాలు వెలువరించనున్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే దశలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. నవంబర్ 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్‌లను స్వీకరించనుండగా.. 15 వరకు స్క్రూట్నీ, విత్‌డ్రాకు అవకాశం కల్పించారు. 30వ తేదీనా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే దఫా పోలింగ్ చేపట్టనున్నారు.

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికల నగారా ఎట్టకేలకు మోగింది. నబంబర్ 3వ తేదీనా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. నవంబర్ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్‌లు స్వీకరించనున్నారు. అనంతరం 13వ తేదీ వరకు వాటిని పరిశీలించనున్నారు. 15వ తేదీ వరకు నామినేషన్‌లను ఉపసంహరించుకునేందుకు గడువు విధించారు. అనంతరం బరిలో ఉన్న అభ్యర్థుల లిస్టును ప్రకటించనున్నారు. నవంబర్ 30వ తేదీనా పోలింగ్ చేపట్టి, డిసెంబర్ 3వ తేదీనా ఫలితాలు విడుదల చేయనుంది.

మహిళా ఓటర్లే కీలకం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ ఎల్లారెడ్డి, జుక్కల్, కామారెడ్డి మొత్తం 9 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిల్లో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. గెలుపోటములు శాసించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 నియోజకవర్గాలకు మొత్తం 20,26,974 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది.



నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఎల్లారెడ్డి	270	1,04,768	1,12,673	03	2,17,702
కామారెడ్డి	266	1,18,718	1,27,080	24	2,45,962
జుక్కల్	255	97,618	1,00,269	10	1,98,035
బాన్సువాడ	258	92,225	1,00,608	08	1,93,032
బాల్కొండ	246	99,728	1,15,898	02	2,15,628
నిజామాబాద్ అర్బన్	289	1,39,163	1,47,571	32	2,86,766
నిజామాబాద్ రూరల్	293	1,16,052	1,32,212	05	2,48,269
ఆర్మూర్	217	96,404	1,09,933	07	2,06,344
బోధన్	246	1,03,577	1,12,381	05	2,15,963

అమల్లోకి ఎన్నికల కోడ్

ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ భవనాలపై రాజకీయ పార్టీలకు ప్రచారాలకు సంబంచించి ఉన్న పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, ఫ్లాగ్స్ తొలగనున్నాయి. శిలా విగ్రహాలను కప్పి పెట్టనున్నారు. పబ్లిక్ స్థలాలలో ఉన్న వాటిని 48 గంటలలోగా, ప్రైవేట్ స్థలాల్లో ఉన్న వాటిని 72 గంటలలోగా తొలగించాలని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమీషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ సంక్షేమ శాఖల అధికారులకు ఇది వరకే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రగతిలో ఉన్న పనులు కొనసాగిస్తూ , ప్రారంభం కానీ పనులు, టెండరు దశలో ఉన్నవి నిలిచపోనున్నాయి.

వ్యయ నియంత్రణపై మానిటరింగ్

వ్యయ నియంత్రణ పై క్లోజ్ గా మానిటరింగ్ చేయనున్నామని, చేసిన ప్రతి ఖర్చుకు రిజిస్టర్ లెక్క చూపవలసి ఉంటుందని, ఫ్లైయింగ్ స్క్వాడ్ నిశితంగా పరిశీలిస్తుందని అన్నారు. ప్రతి నియోజక వర్గానికి మూడు టీముల చొప్పున 2 షిఫ్టులలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా వీడియో సర్వైవల్ టీమ్ ప్రతిదీ చిత్రీకరిస్తుందని, కుల,మత వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టే విధంగా, వ్యక్తిగత విమర్శలు, వంటివి ఉండరాదన్నారు.


కమ్మర్‌పల్లిలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎన్నికల 'తనిఖీ'లు షురూ

- కమ్మర్‌పల్లిలో రూ.5.40 లక్షల నగదు
- ఆర్మూర్‌లో రూ.65 వేల విలువైన మద్యం స్వాధీనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/ఆర్మూర్


పట్టుకున్న నగదు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తనిఖీలు షురూ అయ్యాయి. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.5 లక్షల 40వేలు సీజ్ చేసినట్లు కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రానున్న జనరల్ ఎలక్షన్స్ దృష్ట్యా మండలంలోని టీవీఎస్ షోరూం వద్ద ఎస్సై ఆధ్వర్యంలో కమ్మర్ పల్లి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి దగ్గర రూ.5 లక్షల 40వేలు పట్టుబడినట్లు తెలిపారు. సదరు వ్యక్తిని విచారించాగా పట్టుబడిన డబ్బులకి సంబంధించిన ఎలాంటి పత్రాలు అతని వద్ద లేవన్నారు. పట్టుకున్న డబ్బులను పంచనామా ద్వారా సీజ్ చేసి, అట్టి డబ్బులను ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ వారికి తగిన చర్యలకు నిమిత్తం అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పెర్కిట్ బైపాస్ వద్ద మద్యం పట్టివేత

ఆర్మూర్ : ఎన్నికల కోడు అమలులోకి వచ్చిన రోజే పట్టణ శివారు లోని పెర్కిట్ బైపాస్ బ్రిడ్జి వద్ద సోమవారం అక్రమ మద్యం ను పోలీసులు పట్టుకున్నారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం వాహనాల తనిఖీలు ముమ్మరం చేసినట్టు ,దీంతో 65 వేల విలువగల అక్రమ మద్యం ను పట్టుకున్నట్ల తెలిపారు. నగదు ,అక్రమ మద్యం రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, నగదు తీసుకొని వెళ్లేవారు సంబంధిత ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు.

కొనుగోళ్లలో జాప్యం.. కర్నాటకకు తరలుతున్న ధాన్యం


ధాన్యం తూకం వేసి కర్నాటకకు తరలిస్తున్న రైస్‌మిల్లర్లు

నవతెలంగాణ-రెంజల్

ధాన్యం చేతికి వచ్చినా.. ప్రభుత్వం ధాన్యంకొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కర్నాటకకు తరలుతుంది. చేతికి వచ్చిన పంటను కర్ణాటక రైస్ మిల్లర్లు కొనుగోలు చేసుకొని తరలించుకుంటున్నారు. రెంజల్ మండలంలో ఇప్పటికే ఐదు ఆరు లారీల ధాన్యం కర్ణాటకకు తరలింది. కోసిన వెంటనే పచ్చిధాన్యాన్ని మూడు కిలోల తరుగుతో 2,100 నుంచి 23 వందల వరకు కొనుగోలు చేస్తూ ఉండడంతో, రైతులు కర్ణాటక మిల్లర్లకు విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

మాలల ఐక్య వేదిక ర్యాలీ


నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో మండల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని దుర్గా నగర్ కాలనీతో మొదలుకొని ప్రభుత్వ ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాలల ఐక్యవేదిక మండల అధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మాలలకు ప్రాతినిధ్యం నిరుపేదలైన మాలలకు డబుల్ బెడ్ రూమ్ లు కేటాయించాలని భూమిలేని మాటలకు మూడెకరాల భూమి కేటాయించాలని, పోడు భూములు సాగు చేసుకుంటున్న మాలలకు పొడు పట్టాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో మాలలు కమిటీ హాళ్లనిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు భూపతి. అధ్యక్షుడు సాయిలు, ఉపాధ్యక్షులు. నీరాడి శేఖర్, ప్రధాన కార్యదర్శి కరకనాల-బాలవీరమ్మ, కోశాదికారి, గుబ్బం శ్యామ్,గైని సాములు, రాజు, గుబ్బం సంజీవులు, మండలంలోని వివిధ గ్రామాల మాలల ప్రజానీకం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- విలేకరుల సమావేశంలో కలెక్టర్, సీ.పీ వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో కలెక్టర్, సీ.పీలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలక్షన్ షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి నేటి (సోమవారం) నుండే అమలులోకి వచ్చిందని, డిసెంబర్ 5వ తేదీ వరకు కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్ సహా జిల్లాలో మొత్తం ఆరు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయని వివరించారు. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినందున అనుమతులు లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని, నిర్వహించాల్సివస్తే తప్పనిసరిగా ముందస్తుగా లిఖిత పూర్వకంగా అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారుల నుండి అనుమతులు పొందాలని సూచించారు. ఇప్పటి నుండి ఎంసిఎంసి, సోషల్ మీడియా బృందాలు పనిచేస్తాయని తెలిపారు. ఆరు నియోజకవర్గాలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, వీడియో సర్వేలెన్స్ బృందాలు పనిచేస్తాయని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. నవంబర్ 3వ తేదీ నుండి ఎన్నికల వ్యయ పరిశీలకుల బృందాలు ఏర్పాటు అవుతాయని తెలిపారు.

జిల్లాలో మొత్తం 13 లక్షల 65 వేల 811 మంది ఓటర్లు ఉన్నారని, ఇందుకు గాను 1549 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశామని తెలిపారు. అర్బన్ ఏరియాలో 491 పోలింగ్ కేంద్రాలు రూరల్ ఏరియాల్లో 1058 పీ.ఎస్ లు ఉన్నాయని వివరించారు. మొత్తం ఓటర్లలో 7,18,609 మంది మహిళా ఓటర్లు, 6,47,149 పురుష ఓటర్లు, 59 మంది ఇతర ఓటర్లు, 800 సర్వీసు ఓటర్లు ఉన్నారని తెలిపారు. 18-19 సంవత్సరాల వయస్సు కలిగిన యువ ఓటర్లు 41,019 మంది, ఎనభై ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 17,363 మంది, దివ్యంగ ఓటర్లు 23,934మంది ఉన్నారని అన్నారు. జనాభా ప్రాతిపదికన జిల్లాలో ప్రతి వెయ్యి మందికి 707 మంది ఓటర్లు ఉన్నారని, జెండర్ నిష్పత్తి 11:10 గా ఉందని తెలిపారు. స్వీప్ కార్యక్రమం సందర్భంగా కొత్తగా 53,653 మంది పేర్లు ఓటరు జాబితాలో నమోదు కాగా, వివిధ కారణాలతో 8938 మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని అన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ప్రతి నియోజకవర్గానికి మహిళలకు 5 , యువతకు 1 , వృద్ధులకు 1 చొప్పున మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించే వారిపై సంబంధిత చట్టాలను అనుసరిస్తూ కేసులు నమోదు చేస్తామని అన్నారు కోడ్ ఉల్లంఘన గురించి ప్రజలు నేరుగా 1950 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చని, అలాగే ఈసారి కొత్తగా సీ-విజిల్ యాప్ ను కూడా ఎన్నికల సంఘం అందుబాటులో తెచ్చిందన్నారు. ఈ యాప్ ద్వారా కోడ్ ఉల్లంఘన అంశాలు లైవ్ ఫోటోలు, వీడియోలు తీసి ఈ.సీ దృష్టికి తేవచ్చని సూచించారు. 80 ఏళ్ళు పైబడిన వృద్ధులు, దివ్యంగ ఓటర్లు ఇంటి నుండి ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తూ ఈ.సీ నిర్ణయం తీసుకుందని, ఎన్నికల ప్రకటన వెలువడిన ఐదు రోజులలోపు 12-డి ఫారం భర్తీ చేసి బీ.ఎల్.ఒలకు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. పోలీస్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ, సమస్యాత్మక కేంద్రాలలో పోలీసు బందోబస్త్ తో పాటు మైక్రో అబ్జర్వర్స్ పరిశీలిస్తారని తెలిపారు. జిల్లా పరిహద్దుల్లో చెక్ పోస్టులు ఫ్లైయింగ్ స్కాడ్ బృందాలు పనిచేస్తాయని తెలిపారు. జిల్లాలో సార్వతిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుటకు ముందస్తుగా సమావేశాలు నిర్వహించామని, నోడల్ అధికారులను, సర్వేలెన్స్, ఫ్లైయింగ్ స్కాడ్స్, సిబ్బందిని నియమించామని తెలిపారు. అధికారులకు కేటాయించిన విధులపై ఇప్పకే పలుధపాలు శిక్షణ, సమావేశాలు నిర్వహించామని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న రోడ్లు.. ప్రయాణీకుల పాట్లు



రోడ్డు కుంగిపోవడంతో ఏర్పడ్డ గుంతలతో వాహనదారులకు ఇక్కట్లు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలోని నీలా నుంచి కందకుర్తి వరకు గల రోడ్డు కుంగిపోయి కంకర తేలడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. నీలా, నీలా సబ్‌స్టేషన్, పేపర్ మిల్, కందకుర్తి వరకు గల రోడ్డు అక్కడక్కడ గుంతలు ఏర్పడి కంకర తేలడంతో ప్రయాణికులకు తీవ్ర అవస్థలు కలుగుతున్నాయి. రోడ్డు భవనాల శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువచ్చిన ఎలాంటి ప్రయోజనం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మత్తులను జరిపించాలని, మండల ప్రజలు కోరుతున్నారు.

చేపల మార్కెట్లో బోరు మోటర్ మంజూరు

నవతెలంగాణ-బిచ్కుంద


బోర్‌మోటార్ ప్రారంభం

బిచ్కుంద మండల కేంద్రంలోని చేపల మార్కెట్లో శాసనసభ్యులు హనుమంత్ సిండే ప్రత్యేక నిధుల ద్వారా బోరు మోటర్ మంజూరు చేయడంతో వేసిన బోరులో మోటారును బిగించి ఎంపీపీ అశోక్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ బస్టాండ్ సమీపంలో చేపలు మార్కెట్ కోసం స్థలం కేటాయించి నీటి వసతి కల్పించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీహరి రాజు, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు వెంకటరావు దేశాయి, సొసైటీ చైర్మన్ శ్రీహరిబాలాజీ, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బొమ్మల లక్ష్మణ్, భీఆర్ ఏస్ పట్టణ అధ్యక్షులు అవార్ శ్రీనివాస్, డాక్టర్ రాజు, మత్స్యకారులు ఉన్నారు.

మొక్కజొన్న కొనుగోలు చేపట్టాలి

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-నందిపేట్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని నందిపేట మండల కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ... మద్దతు ధర ఉన్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారుల చేతిలో మొక్కజొన్న, సోయా రైతులు మోసపోతున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్రంలో రైతు పక్షపాతి అని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఏనాడు కూడా రైతులను ఆదుకున్న పాపాన పోలేదని, కొనుగోలు కేంద్రాలు లేక దళారుల చేతిలో రైతులు మోసపోతున్న తరుణంలో నాయకులు మాత్రం రేపటి ఎలక్షన్లలో ఎలా గెలవాలో, ఓటర్లను ఎటువంటి తాయిలాలు ఇచ్చి మభ్య పెట్టాలో అనే దానిపై దృష్టి సారించి రైతు సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఎద్దేవ చేశారు.

మండల అధ్యక్షులు మంద మహిపాల్ మాట్లాడుతూ.. మొక్కజొన్న, సోయా పంటలు చేతికొచ్చేసాయని దళారుల రైతుల వెంబడి మోసం చేసేందుకు చూస్తున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి దళారుల నుండి మొక్కజొన్న సోయా రైతులను కాపాడే విధంగా ఎక్కడికక్కడ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో గెలిచేందుకు పాచికలు వేస్తున్న నాయకులు, రైతుల కష్టాలపై దృష్టి సారించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతన్నలను ఏకం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వైయస్ గంగాధర్, డొంకేశ్వర్ మండల అధ్యక్షులు భూమేష్, రెడ్డిదమ్మాయి శ్రీను, ఎర్రం పోశెట్టి, తుక్కన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పీరాయి నాగరాజు, ఎర్రం పవన్, జితేందర్, నవీన్, శేఖర్, శ్రీకాంత్, గంగయ్య, చిన్నారెడ్డి, గోక గంగారెడ్డి, మరంపల్లి గంగాధర్, దశరథ్, ముత్యం, రవి, శంకర్, శివ, ముఖేష్, సమీర్ పాల్గొన్నారు.


ధర్నా చేపడుతున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ
నిజామాబాద్
2
మంగళవారం | అక్టోబర్ 10, 2023 | www.navatelangana.com

బోధన్ నుంచి కరీంనగర్ డెమో రైల్ ప్రారంభం

నవతెలంగాణ-బోధన్‌టౌన్



బోధన్ పట్టణం నుంచి కరీంనగర్ వరకు రైలును సోమవారం ప్రారంభించారు. రైల్వే అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఇందుకు సహకారాలు అందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రైల్వే శాఖ మంత్రి, ఎంపీ అరవింద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ప్రముఖులు ప్రజాప్రతినిధులు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

పోచారంలో బోనాల పండుగ

నవతెలంగాణ-ఎడపల్లి



మండలంలోని పోచారం గ్రామంలో బోనాల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటికో బోనం చొప్పున మహిళలు తీసుకవచ్చి గ్రామస్థులందరూ ఒక్క చోట కలిసి బోనాలను ఊరేగింపుగా గ్రామ దేవతల వద్దకు తీసుకవచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ తెనుగు అశోక్, కోశాధికారి తాడేం సురేష్, ఎంపిటిసి పద్మ ముత్తెన్న, గ్రామ కమిటీ సభ్యులు నీరడి సాయన్న, నీరడి రవికుమార్, తాడెం ఇస్తారీ, గంగాధర్, వై.సంతోష్, ప్రదీప్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేముల సహకారంతో గ్రామాల అభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

కిసాన్‌నగర్‌లో ముస్లిం కమ్యూనిటీ హాల్, ఈద్గా ప్రహరీ గోడ నిర్మాణం పనులను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రామ్‌రాజ్‌గౌడ్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి రెండు పనులకు ప్రత్యేక చొరవతో మంజూరు చేసిన 11 లక్షల రూపాయలతో పనులు చేపడుతున్నట్లు, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వారు చెప్పారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, బిఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు శరత్, మైనార్టీ తంజీం కమిటీ అధ్యక్షుడు షేక్ రహీముద్దీన్, ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్, కోశాధికారి మహమ్మద్ వాహీద్, నాయకులు స్వామినాథ్, అహ్మద్ హుస్సేన్, న్యాజ్ హుస్సేన్, అన్వర్, ఆరిఫ్, వెంకటేష్, అఖీల్, సాదుల్ల, వసీముద్దీన్, పిఆర్ వర్క్ ఇన్స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

రైలు వెళ్తున్న సమయంలో సమీపంలో వెళ్లిన యువకులు



రైలు సమీపంలో విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రైల్వే గేటు వద్ద సోమవారం ఉదయం రైలు వెళ్తున్న సమయంలో రైల్వే సిబ్బంది గేటు వేసిన కూడా ఇద్దరు యువకులు రైలు వెళుతున్న సమయంలో గేటు కింద నుంచి రైలు సమీపంలో వెళ్లారు. ఒకవేళ జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులంటూ పలువురు యువకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే రైలు గేటు తెరిచిన తర్వాత కూడా వాహనదారులు ఇష్టరీతినా వెళ్లడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి పోలీసు సిబ్బంది సకాలంలో ఉండకపోవడంతో వాహనాలదారులు ఇష్టరీతినా వెళ్తున్నారు. కావున పోలీసులు తక్షణమే స్పందించి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, యువకులు రైలు సమీపంలో వెళ్లకుండా కట్టడి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రెండు డివిజన్ల పరిధిలో సుమారు 22.50లక్షల నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు మేయర్ దండు నీతూ కిరణ్ సోమవారం తెలిపారు. 17వ డివిజన్ గౌతమ్‌నగర్ వాటర్ ట్యాంక్ వద్ద సీసీ డ్రైనేజీ పనుల నిర్మాణానికి, 9వ డివిజన్ ఇంద్రపూర్ కాలనీలో 10లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు మాయావర్ సవిత, సాదు సాయి వర్ధన్, ఇంజినీర్లు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన రాకేష్ గౌడ్ అనే యువకుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. దీనిని బీఆర్‌ఎస్ మీడియా కన్వీనర్ గడ్డం శ్రీనివాస్ అందజేశారు.

'ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్'ల సమ్మె విరమణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆపరేటర్లు

పంచాయతీరాజ్ శాఖ, ఈ పంచాయతీ విభాగంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు, ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు శాంతియుత సమ్మె విరమిస్తూ తిరిగి విధులలో చేర్చుకోమన్ని సోమ వారం పంచాయతీ రాజ్ శాఖ జిల్లా పంచాయతీ అధికారి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈ పంచాయతీ టెక్నికల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు నరహరి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గత నెల 29 నుండి ఈనెల 08 వరకు శాంతియుత సమ్మెను కొనసాగించామని అన్నారు. మా సమస్యల పరిష్కారం కోసం ఆర్థిక, వైద్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు వినోద్ కుమార్ సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించామని తెలిపారు.

పచ్చి మోసగాళ్లను నమ్మొద్దు

- నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బిజెపి, కాంగ్రెస్ పార్టీ మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని, అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి నిధులు ఇవ్వలేని వారు నేడు గ్రామాల్లోకి వచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని, వారుపచ్చి మోసగాళ్ళని, వచ్చే ఎన్నికలు డిచ్‌పల్లి మున్సిపాల్టీలోనే జరుగుతాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఘన్పూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు, డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని దీంతో డయాలసిస్‌తో బాధపడుతూ జిల్లా కేంద్రం, పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందని పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా చేసిన వారు సింగల్ పైసా ఇవ్వని వారు నేడు డబుల్ ఇస్తామని చెప్పి ప్రజల ముందు వస్తున్నారని వారి మాయమాటలు నమ్మొద్దని సూచించారు. డిచ్‌పల్లి మున్సిపాల్టీ చేస్తే దానిలో నడ్పల్లి, ఘన్పూర్, స్టేషన్, గిరిజన తండాలను కలిపి మున్సిపాల్టీ చేస్తామని దీంతో వేగంగా అభివృద్ధి చేసుకోవచ్చని వివరించారు. బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షులు శక్కరికొండ కృష్ణకు న్యాయం చేస్తానని, అధికారంలోకి వచ్చిన వెంటనే మంచి పదవి ఇచ్చే విధంగా చూస్తానని ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. ప్రజల కోసం ఐదేళ్ల పాటు పనిచేస్తున్నానని తెలిపారు. అంతకుముందు పలు కుల సంఘాల కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు పత్రాలను అందజేశారు. మండల బంజారా సేవా సంఘం భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు కావడంతో శంకుస్థాపన చేశారు. గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని, జిల్లా బంజారా భవన్ నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు చేసినట్టు వివరించారు.

అనంతరం గిరిజనులు, ఘన్పూర్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్, సహకార సొసైటీ చైర్మన్ గజవడ జైపాల్, తారాచంద్ నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు చితం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి కోర్బ సవిత రామకృష్ణ, కోఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, బంజార సేవ సంఘం మండలాధ్యక్షులు బాల్‌రాం నాయక్, జగదీష్, సర్దార్, మోహన్ నాయక్, మోహమ్మద్ యూసుఫ్, ఎంపిటిసి సాయిలు, నల్లవెల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల అక్రమ అరెస్టులను ఖండించండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



ధర్నా చేస్తున్న నాయకులు

ఆశావర్కర్ల అక్రమ అరెస్టులను ఖండించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం చలో హైదరాబాద్ తరలివెళ్తున్న ఆశా కార్యకర్తలను రైల్వే స్టేషన్లో, వాహనాల్లో, ఇండ్ల వద్ద అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ తీవ్రంగా ఖండించారు. అక్రమంగా అరెస్టు చేసి ఒకటవ టౌన్‌లో నిర్బంధించిన ఆశా కార్యకర్తలను, పోలీస్ స్టేషన్ వెళ్లి పరామర్శించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఉద్యమాలను అక్రమ అరెస్టులతో నిర్బంధాలతో అణిచివేయాలని చూడటం దుర్మార్గమని అన్నారు. అణిచివేయాలని చూస్తే ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. అనేక మంది కార్యకర్తలు పోలీసుల కళ్ళు కప్పి హైదరాబాద్ చేరుకుంటే అక్కడ కూడా అరెస్టులకు పరంపర కొనసాగించడం హేయమైన చర్య అని అన్నారు. ఆశావర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, అధికారుల వేధింపులు ఆపాలని, హెల్త్ కార్డు, ఉద్యోగ భద్రత పీఎఫ్, ఈఎస్‌ఐ లాంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కోకన్వీనర్లు కటారి రాములు, ధ్యారంగుల కృష్ణ, అరెస్ట్ అయిన వారిలో ఆశ యూనియన్ నాయకులు సుకన్య, లలిత, వహీదా, 50మంది ఆశాకార్యకర్తలున్నారు.

నుడా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా



నుడా చైర్మన్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో బృందం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/మోపాల్

నూడా పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని నూడ చైర్మన్ ఈగ సంజీవరెడ్డి అన్నారు. నూడా కార్యాలయంలో సోమవారం నూడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డిని టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యాదర్శులు అలుక కిషన్, శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అలుక కిషన్ నూడా చైర్మన్‌కు అభినందలు తెలిపి ఆయన మాట్లాడుతూ.. నూడా పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, మరిన్ని ఉన్నత పదవులు పొందాలని అన్నారు. ఈ సందర్భంగా నూడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి మాట్లాడుతూ నూడా పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని, ఎమ్మెల్సీ కవిత, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు తీసుకువెళ్తానని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ కార్యదర్శి అమృత్ కుమార్, సి.నారాయణరెడ్డి, శ్రీనివాస్, జాఫర్, జాకీర్ ప్రసాద్, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో నుడా చైర్మన్‌కు సన్మానం

మోపాల్ : మోపాల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూడా చైర్మన్ స్వగృహంలో ఘనంగా సన్మానించారు. అలాగే ఎంఎల్‌ఏ నిధుల నుండి గౌడ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి 5లక్షల ప్రొసీడింగ్ కాపీని ఎంఎల్‌ఏ చేతుల మీదుగా క్యాంప్ ఆఫీస్‌లో అందుకున్నారు. అందుకుగానూ నిధులు గౌడ సంఘానికి ఇప్పించినందుకు బాజిరెడ్డి గోవర్ధన్‌కు, ఈగ సంజీవరెడ్డికి మోపాల్ గ్రామ గౌడ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు సతీష్‌రెడ్డి, మోతే గంగాధర్‌గౌడ్, దత్త గౌడ్, ఎల్లా గౌడ్, రాజేశ్వర్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, రామగౌడ్, గంగాధర్‌గౌడ్, బీఆర్‌ఎస్ యువనాయకుడు సయ్యద్ నాభి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి చీరలు, హెల్మెట్ల పంపిణీ మీద ఉన్న ధ్యాస రైతులపై లేదు
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి చీరలు, హెల్మెట్ల పంపిణీ మీద ఉన్న ధ్యాస రైతులపై లేదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో మొక్కజొన్న పంట కోతలు ప్రారంభమై, రైతులు సగం ధాన్యాన్ని అమ్ముకున్నాగాని ఈ అసమర్థ ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ మొక్కజొన్నకు రూ.2090 మద్దతు ధర ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు రూ.18వందలకు, 19వందలకే అమ్ముకుంటున్నారని మండిపడ్డారు. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తక్షణమే స్పందించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి రైతులను ఆదుకోవాలని, అదేవిధంగా వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు నష్టపోయిన రైతులెవరూ నిరాశకు గురికావొద్దని ఇంకో రెండు నెలల్లో రాష్ట్రంలో బిజెపి డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వమంటే బిఆర్‌ఎస్ ప్రభుత్వం లాగా మాటలు చెప్పే ప్రభుత్వం కాదని, చేతల్లో చేసి చూయించే ప్రభుత్వమన్నారు. అందుకే పసుపు బోర్డు హామీ ఇచ్చి నెరవేర్చామన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు చాలా నష్టపోయారని ఎవరు కూడా దిగులు చెందవద్దని రాబోయేది రైతుల పక్షపాతి బిజెపి సర్కార్ అని, బిజెపి సర్కార్ వచ్చాక రైతులకు మేలుచేసే అనేక కొత్త పథకాలు తీసుకొస్తామని స్పష్టం చేశారు. భారీ వర్షాల వల్ల సొయా పంట కూడా తీవ్రంగా నష్టపోయిందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాకన్న ముందు రైతులు సొయా విత్తనాలను సహకార సంఘాలలో కొనుక్కునేవారని, కానీ ఈ అసమర్థ బిఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక దళారులు విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు రైతులందరికి అమ్మడం వల్లనే సొయా పంట పూర్తిగా నష్టపోయి రైతులందరు తీవ్ర దుఃఖంలో ఉన్నారన్నారు. 2018 ఎన్నికలప్పుడు ముఖ్యమంత్రి కేసిఆర్ మోర్తాడ్ సభలో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వారిపైన పీడీ యాక్ట్ కింద కేసు బుక్ చేస్తామన్నారని, కానీ నకిలీ విత్తనాల వల్ల రైతులు ఇంత నష్టపోయిన ఎవ్వరికి ఒక్క రూపాయి నష్టపరిహారం కూడా అందించలేదని విమర్శించారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఈ విషయంపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, బిజెపి సీనియర్ నాయకులు రెంజర్ల గంగారాం, మండల అధ్యక్షులు కట్ట సంజీవ్, ప్రధాన కార్యదర్శి రెంజర్ల గంగాధర్, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, చింత ప్రవీణ్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఫలహారం యాదగిరి, బీజేవైఎం అధ్యక్షులు కొత్తపల్లి అరుణ్, సోషల్ మీడియా కన్వీనర్ కమలాకర్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కుంట భూమారెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు మల్లేష్ యాదవ్, చింత హన్మంతు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ కాదు.. లైన్‌మెన్

నవతెలంగాణ-రెంజల్



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న లైన్‌మెన్

మండలంలోని రోడ్డుకిరుపక్కన నాటిన హరితహారం మొక్కలు నేడు పెద్ద వృక్షాలుగా మారడంతో తరచుగా విద్యుత్ అంతరాయం ఏర్పడు తుండడంతో, స్థానిక లైన్మెన్‌లకు సమస్యలు తప్పడం లేదు. రోడ్డుకిరుపక్కల అధికారులు మొక్కలు నాటడంతో పైన ఉన్న కరెంటు వైర్లకు అవి తగులుతూ ఉండడంతో మూడు నెలలకోసారి వాటిని తొలగించడం తప్పడం లేదు. ప్రతిసారి కూలీలు దొరకడం కష్ట తరమవడంతో స్థానిక ప్రభుత్వ ఉద్యోగి లైన్‌మెన్ వ్యవసాయ కూలీ అవతారం ఎత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. కరెంటు తీగల కింద మొక్కలు నాటొద్దని పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ మొక్కలు నాటడం పరిపాటి అయింది. చేసేది లేక లైన్‌మెన్లే తీగలకు తగలకుండా చెట్టుకొమ్మలు నరకడం తప్పడం లేదు. మండలంలో సబ్‌స్టేషన్ మొదలుకొని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లకు ఇరుపక్కలా కరెంటు తీగల కిందే మొక్కలు నాటడంతో లైన్‌మెన్‌లకు అవస్థలు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

రిలే దీక్షలకు కమ్మ సంఘం సంఘీభావం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 13వ రోజు రిలే నిరాహారదీక్షలు పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీక్షలకు కమ్మ సంఘం నాయకులు మండవ రామకృష్ణ, నాగేశ్వరరావు సంఘీభావం తెలిపారు. గత 30 రోజులుగా చంద్రబాబు నాయుడుని అరెస్టు చేసి, ఎలాంటి ఆధారాలు చూపకుండా కాలం వెళ్లదీస్తున్నరని మండిపడ్డారు. బాబుతో మేము అంటూ నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. స్కిల్ స్కాం పేరుతో అవినీతి చేశారని అంటున్న మేధావి వర్గం, నిరూపించకుండా కాలయాపన చేయడానికి మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా, ఆంధ్రప్రదేశ్‌లో పాలన కొనసాగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌పై మండిపడ్డారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, రెంజర్ల సురేష్, జ్యోతి నారాయణ, ప్రతాప్‌రెడ్డి, కోయిడి నర్సింలు, లక్ష్మీనారాయణ గౌడ్, బొబ్బ నరసింహ, షేక్ ఫెరోస్, శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, వేముల నాగేశ్వరరావు, లక్ష్మీ యాదవ్, రఫిక్, రాజేశ్వర్, రవికుమార్ పాటిల్, చిన్నారెడ్డి, శంకర్, నరసయ్య, మల్లేష్ గౌడ్, యాదగిరి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి

,నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 13 కార్పొరేషన్లలో 128 మున్సిపాలిటీలలో సుమారు 60 వేల మంది కార్మికులు శానిటేషన్, ఇతర పనులు చేస్తున్నారన్నారు. వారికి పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిహెచ్ఎంసిలో నెలకు 19వేలు ఇస్తూ, రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలలో కేవలం 15600 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులు అత్యంత దుర్గింధపూరిత వాసనలో, ప్రమాదకరమైన గ్యాస్ విడుదలతో పనిచేస్తున్నారని, డ్రైనేజీలో దిగి ప్రాణాలు పోతున్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులు దేవుళ్ళని కితాబులు ఇస్తే, దేశ ప్రధాని మున్సిపల్ కార్మికులను సత్కరిస్తూ, శాలువాలు కప్పి పొగడ్తల్లో ముంచెత్తారే తప్ప, మున్సిపల్ కార్మికులకు తగిన విధంగా జీతాలు పెంచ లేదని ఆరోపించారు. ఒకవైపు తెలంగాణ ధనిక దేశం అని చెపుతూ ఏపీలో మున్సిపల్ కార్మికులకు నెలకు 21000 రూపాయలు, ఇతర అలవెన్సులతో ఐదు వేలు మొత్తం కలిపి 26,000 రూపాయలు చెల్లిస్తుంటే ధనిక రాష్ట్రంలో మాత్రం మున్సిపల్ కార్మికుల పరిస్థితి దీనంగా ఉందన్నారు. కావున తెలంగాణ మున్సిపల్ కార్మికులకు నెలకు 26 వేల రూపాయలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కే. రాజేశ్వర్, గోవర్ధన్, శివకుమార్ నాయకులు కిరణ్, కళావతి, నవనాథ్, నర్సింగరావు, రజిని, రవి, యాదమ్మ, గోవర్ధన్, రవి, తిరుపతి, సైదులు, రాజమల్లు, గంగాధర్, నర్సయ్య, సుజాత, లక్ష్మి భరత్, నాగేశ్వర్, లక్ష్మమ్మ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన యువకులకు సన్మానం


ఉద్యోగాలు పొందిన వారిని సన్మానిస్తున్న గ్రంథపాలకుడు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగులకు సన్నద్ధం అయినా గాంధారి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధగ్రామాల విద్యార్థిని విద్యార్థులు ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ 20 మంది అభ్యర్థులు కష్టపడి ఉద్యోగులు సాధించారు. ఈ సందర్భంగా గాంధాలయం లైబ్రేరియన్ శ్రీనివాస్ కానిస్టేబుల్ ఉద్యోగలు సాధించిన అభ్యర్థులను శాలువాతో సన్మానించారు అభ్యర్థులను 9 వార్డు సభ్యులు నితిన్ అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ లంబాడి తండా పక్కన సిసి రోడ్డు నిర్మాణానికి ఎంపీ బీబీ పాటిల్ నిధుల నుండి 5 లక్షలు మంజూరు కాగా సోమవారం సర్పంచ్ సురేష్ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సురేష్ ఉప సర్పంచ్ విట్టల్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు ఎంపీ నిధులు రాబట్టి అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విట్టల్, గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ విజయ్, బీఆర్ఎస్ యువ నాయకులు అక్షయ పటేల్, మండల అధ్యక్షులు బస్సీ పటేల్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, రోడ్డు నిర్మాణం గుత్తేదార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం

- నేటి నుంచి అమల్లోకి ఎన్నికల కోడ్
- కలెక్టర్ జితేశ్ వి పాటిల్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించుటకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించడంతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఆఫ్ ఖండక్ట్‌ను ఖచ్చితంగా ఆమలుచేయుటపై దిశా నిర్దేశం చేయుటకు నోడల్ అధికారులు, వివిధ బృందాలు, తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వోద్యోగులు ఎవరు కూడా రాజకీయ సంబంధ అంశాలలో, కార్యక్రమాల్లో భాగస్తులై వ్యవస్థకు చెడ్డపేరుతేవద్దని, ఆటువంటి వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెయిడ్ న్యూస్, ఫేక్ న్యూస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, తప్పుడు ప్రచారాలు వ్యాప్తి చెందకుండా చూడాలని, వాట్సాప్ గ్రూప్ లు మానిటరింగ్ చేయాలని అన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరు కృషి చేయాలని, ఎన్నికల నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు.

అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్‌తో కలిసి మాట్లాడుతూ ఎన్నికల సంఘం నవంబర్ 3న షెడ్యూల్ ప్రకటిస్తుందని, 10 వరకు నామినేషన్లు స్వీకరించి, 13న స్క్రూటినీ చేస్తుందని, 15 న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో నిలబడే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తుందని అన్నారు. నవంబర్ 30 న పోలింగ్, డిసెంబర్ 3 న ఓట్ల లెక్కింపు ఉంటుందని, డిసెంబర్ 5న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని అన్నారు. జిల్లాలోని కామారెడ్డి,. యెల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాల్లో 6,61,163 మంది ఓటరులు న్నారని, ఇందుకోసం 791 పోలింగ్ కేంద్రాలు, 75 రూట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మహిళల కోసం ప్రత్యేకంగా ప్రతి మండలంలో ఒక మాడల్ పోలింగ్ కేంద్రాన్ని, దివ్యంగుల కోసం నియోజక వర్గం వారీగా మాడల్ పోలింగ్ కేంద్రంతో పాటు యువతను ప్రోత్సహించుటకు మాడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర సగటుతో పోలిస్తే జిల్లాలో ఓటింగ్ శాతం అధికంగా ఉందని, కాగా పట్టణ ప్రాంతాలలోని వారు ఇంకా ముందుకు వచ్చి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వీప్ ద్వారా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ.వి.ఏం లపై అవగాహన కలిగించామన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలలో కనీస మౌలిక వసతులు కల్పించామన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సరైన అభ్యర్థిని గుర్తించి నిజాయితీగా ఓటు వేయాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించు టకు ఎన్నికల సంఘం స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసిజర్ లో ఎన్నో నిబంధనలు పెట్టిందని అందులో అభ్యర్థి ఎన్నికల ఖర్చు 40 లక్షలకు పరిమితి విధించిందని అన్నారు. ఓటరుకు డబ్బులు,కానుకలు ఇవ్వడం, మభ్యపెట్టడం ప్రలోభాలకు గురిచేయడం, భయపెట్టడం నేరంగా పరిగణించిందని, అతిక్రమిస్తే శిక్షార్హులని అన్నారు. అసత్య వార్తలు వ్యాప్తి చెందకుండా చూడవలసిన భాద్యత మీడియాపై ఉందని అన్నారు. ధ్రువీకరించని ప్రకటనలు ప్రచురించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల , నోడల్ అధికారులు, తహసీల్దార్లు,, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్ఎంసి పత్రానికి డబ్బులు వసూలు చేస్తే చర్యలు

- తహసీల్దార్ శివప్రసాద్
- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-భిక్కనూర్

ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు బ్రోకర్లు డబ్బులు వసూలు చేస్తున్నారని నవతెలంగాణ దినపత్రికలో సోమవారం " ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ దందా " కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. కథనానికి భిక్కనూర్ తాసిల్దార్ శివ ప్రసాద్ స్పందించారు. రెవెన్యూ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తే కఠినమైన చర్యలు తప్పవని, ఎవరైనా డబ్బులు తీసుకుంటే తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ధ్రువపత్రాలు ఇస్తామని డబ్బులు వసూలు చేస్తున్న బ్రోకర్లను నమ్మవద్దని మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకున్న పత్రాలతో తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శనగ, మినుము విత్తనాలు పంపిణీకి సిద్ధం

- రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ


విత్తనాలు అందజేస్తున్న సొసైటీ అధ్యక్షులు

నవతెలంగాణ-బిచ్కుంద

రానున్న రబీ సీజన్లో పంట వేయటానికి శనగ, మినుము విత్తనాల బ్యాగులు సిద్ధంగా ఉన్నాయనీ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బిచ్కుంద రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరి బాలాజీ అన్నారు. సోమవారం బిచ్కుంద మండల కేంద్రంలోని రైతు సహకార సంఘంలో రైతులకు సెనగ, మినుము విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ జేజీ 11 25 కిలోల శనగల బస్తా ధర 1875 రూపాయలు, మినుములు నాలుగు కేజీల బస్తా ధర 424 రూపాయలు ఉందన్నారు. సొసైటీలో పంపిణీ చేయడానికి విత్తనములు సిద్ధంగా ఉన్నాయని కావున రైతులు నాణ్యమైన విత్తనములు కొనుగోలు చేసి సొసైటీ అభివృద్ధికి సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదరావు, సీఈవో శ్రవణ్ కుమార్, సీతారాం పల్లి సర్పంచ్ గంగారెడ్డి, కందర్పల్లి సర్పంచ్ గంగారాం, డైరెక్టర్ శివరాజ్ పటేల్, సంతోష్, నాయకులు డాక్టర్ రాజు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు బొమ్మల లక్ష్మణ్, నాయకులు గణేష్ గొండా, సిబ్బంది సచిన్, రైతులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం కార్మికులు బిక్షాటన



భిక్షాటన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలో మధ్యాహ్నం భోజనం కార్మికులు చేస్తున్న సమ్మె పదవ రోజుకు చేరుకోవడంతో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు బిచ్కుంద మండల కేంద్రంలో తహసిల్ కార్యాలయం నుండి ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ బిక్షటన చేసి నిరసన తెలిపారు. పెండింగ్ బిల్లులు సకాలంలో విడుదల చేయాలని గత పది రోజులుగా తాము నిరసన కార్యక్రమాలు చేపడుతున్నపటికి ప్రభుత్వం నుండి ఎటువంటి హామీ లభించకపోవడంతో మధ్యాహ్న భోజనం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ప్రకటించిన నేపథ్యంలో తాము సమ్మె విరమిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల అధ్యక్షులు కృష్ణ, ఉపాధ్యక్షులు మారుతి, క్యాషియర్ సుదర్శన్ గొండ, కార్యదర్శి సాయిలు, సలహాదారులు దశరథ్, విట్టల్ మహారాజ్, భాగ్యలక్ష్మి, అంజవ్వ, లక్ష్మీబాయి, ఉన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్


గోదాం పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సోమవారం పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్లు, వీ.వీ.ప్యాట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకుని, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. ప్రస్తుతం జిల్లాకు వీ.వీ.ప్యాట్ లు, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, కంట్రోల్ యూనిట్లు అన్నీ కూడా కొత్త వాటిని కేటాయించారని ఎన్నికల విభాగం అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

పేదప్రజల కష్టాలు తీర్చిన కేసీఆర్

- మరోసారి ఆశీర్వదించాలి : జాజల సురేందర్


సదాశివనగర్‌లో..


గాంధారిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి/సదాశివనగర్

పేద ప్రజల కష్టాలు తెలిసి మనకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గాంధారి మండల కేంద్రంలో నిర్మించిన బిటి రోడ్డు, వ్యవసాయ సహకార సంఘం భవనం ప్రారంభోత్సవాలు నిర్వహించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గాంధారి మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గత 5 సంవత్సరాల నుండి ప్రజలు మధ్యనే తిరుగుతున్నా అని, ప్రజల కష్టాలు తెలుసుకుంటూ ప్రజల మధ్యనే తిరిగా అని, మళ్లీ గెలిపిస్తే ప్రజల కోసం పనిచేస్తానని అన్నారు. తన కోసం 50 రోజులు కష్టపడితే.. ప్రజల కోసం 60 నెలలు కష్టపడు తానని, మళ్లీ తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాధబలరాం, జడ్పీటీసీ సభ్యులు శంకర్ నాయక్, ఏ ఎం సి చేర్మెన్ సత్యం రావు, పిఏసిఎస్ చేర్మెన్ సాయికుమార్, గాంధారి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, ఏఎంసి వైస్ చైర్మన్‌రెడ్డి రాజు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన జాజాల

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజల సురేందర్ ప్రారంభించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మార్కెట్ కమిటీ భవనానికి 40 లక్షలు, ప్రహరీ గోడ నిర్మాణానికి 47 లక్షల నిధులతో నిర్మించినట్టు తెలిపారు. మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ కి శంకుస్థాపన చేశారు. 20 లక్షలతో భవననిర్మాణం, కొత్త చెరువు నుండి పాత చెరువు వరకు పీడల్ కెనాల్ పూడిక తీత పనులకు 9-85 లక్షల తో పనులతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉత్నూర్‌లో ఖండేరాయ ఆలయంలో కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గైని అనసూయ, జడ్పీటీసీ కమిలి నర్సింలు, మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లం సాయిరెడ్డి, వైఎస్ చైర్మెన్ వడ్ల రాజేందర్, స్థానిక సర్పంచ్ బద్ధం శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి గంగు, సూపవైజర్ లక్ష్మీ నర్సయ్య, వివిధ గ్రామల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సింగిల్ విండో చైర్మన్ లు తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో అల్పాహారం

- కలెక్టర్ జితేశ్ వి పాటిల్


పిల్లలకు టిఫిన్ వడ్డిస్తున్న అధికారులు..


పిల్లలతో కలిసి టిఫిన్ చేస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

దేవునిపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం అల్పాహారం ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ కే. రవి కాంతారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తుందని తెలిపారు. మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఇడ్లీ, పూరి, కిచిడి వంటివి ప్రతిరోజు అందజేయాలని చెప్పారు. విద్యార్థులు ఇష్టపడి చదివి సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం వండిన అల్పాహారంను రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన యువకులకు సన్మానం


యువకులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్, ఉప సర్పంచ్ విట్టల్ ఆ ముగ్గురు యువకులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ముగ్గురు యువకులు పోలీస్ శాఖ కొలువుల్లో ఎంపికై గ్రామానికి వన్నె తెచ్చారని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో ముగ్గురు యువకులు తో పాటు వారి తండ్రులు వచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో సర్పంచ్ ఉప సర్పంచ్ తో పాటు బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బస్సీ పటేల్ వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

తూము దంపతుల దారెటు?

- హస్తం వైపు మొగ్గుచూపుతున్నట్లు ప్రచారం
- ఎమ్మెల్యే షకీల్‌ను ఓడించడమే లక్ష్యంగా పావులు



నవతెలంగాణ-బోధన్


బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి శరత్ రెడ్డి దంపతులు ఏ పార్టీలో చేరబోతున్నారోనని అంతట కార్యకర్తలలో ఉత్కంఠ నెలకొంది. గత కొన్ని నెలలుగా బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌తో ఏర్పడిన విభేదాల కారణంగా అధికార పార్టీ కార్యక్రమాలలో పాల్గొనకుండా మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి-శరత్ రెడ్డి దంపతులు దూరంగా ఉంటున్నారు. బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహం పెట్టినప్పటి నుండి విభేదాలు తీవ్రమయ్యాయి. రాను రాను విభేదాలు ముదరడంతో తూము పద్మావతి దంపతులు అధికార పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. దాంతో తూము శివమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా బిజెపిలో చేరుతారని, ఎంఐఎం పార్టీలో చేరుతారని ఊహగానాలు వచ్చాయి. అయిన వారు ఎలాంటి ఊహగానాలను పట్టించుకోకుండా వారి పని వారు చేసుకుంటూ పోతున్నారు. ఈ దశలో తన క్యాడర్ జారిపోకుండా జాగ్రత్తలు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి తన అనుచరులతో సమావేశం నిర్వహిస్తూ భవిష్యత్ ప్రణాళిక రూపకల్పనలో బిజీగా మారారు. ఒక దశలో అధికార పార్టీ నుండి ఎమ్మెల్యే టికెట్ వస్తుందని ఆశించి భంగపడ్డారు. ఆయిన తన భవిష్యత్తు రాజకీయ జీవితం మరింత మెరుగుపరచడానికి శరత్ రెడ్డి దంపతులు ప్రణాళికలు చేస్తున్నారు.

హస్తం గూటికేనా..

మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి శరత్ రెడ్డి దంపతులు త్వరలో బీఆర్ఎస్ పార్టీని వీడి హస్తం గూటికి చేరనున్నట్లు ప్రచారం జరుగుతుంది. తన ప్రత్యర్థిగా భావిస్తున్న ఎమ్మెల్యే షకీల్ అమీర్‌ను ఎన్నికల్లో ఓడించడానికి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. పూర్వ వైకాపా మాజీ ఎంపీతో ఉన్న పరిచయం వలన కాంగ్రెస్ పార్టీలో చేరడానికి చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం. మరో నాలుగైదు రోజులలో ఏ పార్టీలో చేరుతున్నామో స్పష్టం చేస్తామని తూము పద్మ శరత్ రెడ్డి దంపతులు పేర్కొన్నారు. ఇప్పటికే వీరితో 15 మంది కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు అందుబాటులో ఉండి బీఆర్ఎస్ ను వీడీ తూము దంపతులతో వారితోనే చేరడానికి సిద్ధమైనట్లు సమాచారం. ఏదేమైనా ప్రస్తుతం జరిగే శాసనసభ ఎన్నికలు బోధన్ లో రసవత్తరంగా జరగనున్నాయి.

కాంగ్రెస్ టికెట్‌లపై సర్వత్రా ఉత్కంఠ

- ఎల్లారెడ్డిలో పట్టువీడని మదన్‌మోహన్, సుభాశ్‌రెడ్డి
- టికెట్ ఎవరిని వరించునో..?


వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి


మదన్‌మోహన్

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉన్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఆ పార్టీ నుంచి ఎవరికి టికెట్ వరించనుందో ఉత్కంఠగా మారింది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 4 నియోజక వర్గాలు ఉన్నా.. ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ టికెట్ కేటాయింపు పట్ల అందరి దృష్టి నెలకొంది.

బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు టికెట్ కేటాయించిన విషయం విధితమే. ఇక ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అయితే కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి, మదన్ మోహన్ రావు, తాడ్వాయి రాజేశ్వర్‌రెడ్డి టికెట్ కోసం ముగ్గురు దరఖాస్తులు చేసుకోగా కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యంగా ఇద్దరి పేర్లను పరిశీలిస్తోంది. వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, మదన్ మోహన్‌రావు పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం తుది నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే అధిష్టానం గెలుపు గుర్రాలను బరిలో దించాలనే యోచనలో వున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీ సిద్ధం చేసిన తుది జాబితాను స్క్రీనింగ్ కమిటీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల తొలి జాబితా వెలువడనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ కు ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది కాంగ్రెస్ పెద్దలు నియోజకవర్గంలో గెలిచే అభ్యర్థుల కోసం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ నియోజకవర్గంలో ప్రజాకర్షణ, ప్రత్యర్థులను ఎదుర్కొనే సత్తా ఏ నేత ఎవరు, ఆర్థిక, అంగబలం ఎవరికి ఉన్నాయి? సర్వేలు ఎవరికి అనుకూలంగా వచ్చాయో వాటి ఆధారంగా కాంగ్రెస్ అధిష్టానం వడపోత చేపడుతున్నది. గెలిచే అభ్యర్థికే టికెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ పెద్దలు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. రెండు మూడు రోజుల్లో టికెట్‌లు ఖరారు చేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎవరికైతే టికెట్ రాదో వారిని కాంగ్రెస్ పెద్దలు బుజ్జగించే పని లో పడినట్లు తెలిసింది. పార్టీ అభ్యర్థికి కాంగ్రెస్ పరంగా రెబల్‌గా బరిలో ఉండకుండా అధిష్టానం జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందోనని జోరుగా ప్రచారం సాగుతోంది.

బాన్సువాడకు మదన్‌మోహన్..?

అయితే మదన్‌మోహన్‌ను బాన్సువాడ నుంచి బరిలో దించేందుకు అధిష్టానం ఆలోచన చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. బాన్సువాడలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కాసుల బాల్‌రాజ్ పోటీ పడ్డా.. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరించినట్టు ఆరోపణలు వ్యక్త అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో మదన్‌మోహన్‌ను బుజ్జగించి బాన్సువాడ నుంచి బరిలో దించేలా ప్రయత్నాలు చేపట్టినట్టు ప్రచారం సాగుతుంది. అయితే కాంగ్రెస్ పార్టీ ఒక వేళ టికెట్ ఇచ్చేందుకు నిరాకరిస్తే.. స్వతంత్రంగా అయినా బరిలో నిలిచేందుకు మదన్‌మోహన్ సిద్ధం అన్నట్టు సంకేతాలు పంపినట్టు వినికిడి.

సమస్యలు పరిష్కరించాలి



- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని, గౌరవ వేతనం 3000 ఇవ్వాలని, అల్పాహారానికి సరిపడా సరుకులను సరఫరా చేసి కనీస వేతన ఇవ్వాలని, యూనిఫాంలు, ప్రమాద బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అక్రమ తొలగింపులు మానుకోవాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో తుకారం నాయక్, సురేందర్‌రెడ్డి, సుజాత, లక్ష్మి, నిరంజన, సుమలత, పరవ్వ, బాలరాజు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మొరం అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి

- సీపీఐ(ఎం) మాక్లూర్ మండల కార్యదర్శి కొండ గంగాధర్
- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

అక్రమంగా మొరం తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ సిపిఎం పార్టీ మాక్లూర్ మండల కార్యదర్శి కొండ గంగాధర్ ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని మాదాపూర్ గ్రామ శివారు 934, 935 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమి గ్రామంలోని కొందరు మొరం తవ్వకాలు అక్రమంగా రవాణా చేస్తున్నారని, ఎటువంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలిపారు. గుట్ట ప్రాంతమైన మొరం తవ్వకుంటూ కొందరు అక్రమార్కులు భూకబ్జాలు చేస్తున్నారని వివరించారు. ఈ విషయం సిపిఐఎం సందర్శించి అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు.

జంబి హనుమాన్ ఆలయంలో పూజలు



మేరీ మిట్టి మేరీ దేశ్ కార్యక్రమంలో నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బిజెపి పిలుపుమేరకు 'మేరీ మిట్టి మేరీ దేశ్' అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో బిజెపి నాయకులు పైడి రాకేష్‌రెడ్డి పూజలు నిర్వహించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో సేకరించిన మట్టిని అమృత కలశాల్లో తీసుకొని స్థానిక జంబి హనుమాన్ ఆలయం వద్ద నియోజకవర్గంలోని అన్ని మండల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్ శాఖల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ దేశ ఐక్యతకు అమరుల స్మృతి వనం కోసం ఈ మట్టిని వాడుతారని దేశంలో ఉన్న ప్రజలు భద్రత విషయంలో ఒకే తాటి పై ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, కౌన్సిలర్ సాయి, బీజేపీ మండలాధ్యక్షుడు రోహిత్ రెడ్డి, గిరీష్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలి

- సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రేయ గౌడ్

నవతెలంగాణ-ఇక్రాన్‌పల్లి

ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రేగౌడ్ సోమవారం అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వేళ ప్రజలను చైతన్య పరచాలనే ఉద్దేశ్యంతో నిజామాబాద్ పట్టణంలోని వినాయక్‌నగర్‌లోని నారాయణ ఇంటి ఆవరణలో కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలో ఓటు హక్కు ఆర్టికల్ 326 ప్రకారం హామీ ఇవ్వబడిందన్నారు. ఈ ఆర్టికల్ ప్రకారం "ప్రతి రాష్ట్రంలోన ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరే విధంగా కృషి చేయాలి

- మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో సోమవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను మండల విద్యాశాఖ పక్షాన ఘనంగా సన్మానించారు. బాల్కొండ మండలానికి నూతనంగా ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన జెడ్పిహెచ్ఎస్ వన్నెల్ బి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పిహెచ్ఎస్ కిసాన్‌నగర్ ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర కుమార్, జెడ్పిహెచ్ఎస్ చిట్టాపూర్ ప్రధానోపాధ్యాయులు కుబీర్ శ్రీనివాస్, జెడ్పిహెచ్ఎస్ రెంజర్ల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ జెడ్పిహెచ్ఎస్ ముప్కాల్ ప్రధానోపాధ్యాయులు గంగారాం, జెడ్పిహెచ్ఎస్ పోచంపాడు ప్రధానోపాధ్యాయులు మనోహర్, జెడ్పిహెచ్ఎస్ బస్సాపూర్ ప్రధానోపాధ్యాయులు మంత్రి రమేష్, జెడ్పిహెచ్ఎస్ మెండోర ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసమూర్తి, జెడ్పిహెచ్ఎస్ వెల్కటూర్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఇతరులను మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వర్ మాట్లాడుతూ.. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అందరూ పూర్తిస్థాయిలో ఉన్నత పాఠశాలలో విధులలో చేరినందున ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించుటకు, కాంప్లెక్స్ స్థాయిలో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయడం వల్ల నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

నవతెలంగాణ-ఎడపల్లి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గంగపుత్ర సంఘం మత్స్యకారులు ఆర్థికంగా ఎదిగాలని ఉద్దేశంతో చేప పిల్లలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారి రాజనర్సయ్య అన్నారు. ఎడపల్లి ఎంపీడీవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో గంగపుత్ర సంఘం పెద్దలకు చేప పిల్లలను అందజేసి చెరువులో విడుదల చేశారు. కార్యక్రమంలో ధర్మారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు సుందు కిషన్, ధర్మారం, ఎడపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శులు పద్మావతి, రాజేష్, జిల్లా మత్స్యశాఖ కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ బోయ లక్ష్మణ్, దత్తాత్రేయ, మత్స్య శాఖ కార్మికులు పాల్గొన్నారు.



చేపపిల్లలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఓటమి భయంతోనే తీర్మానాలు

- తాయిలాలతో కొత్త సంస్కృతికి నాంది పలికిన మంత్రి
- పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్



మాట్లాడుతున్న వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే గ్రామాల్లోని కుల సంఘాలతో తీర్మానాలు చేయిస్తూ మహిళలకు చీరలు, యువకులకు హెల్మెట్లు పంచుతున్నారని పిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ విమర్శించారు. బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఎన్నికలకు ముందే తాయిలాలు పంచుతూ ఒక కొత్త సంస్కృతిని తీసుకొచ్చారని ఆరోపించారు. సోమవారం మండలంలోని ఉప్లూర్‌లో ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డికి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి బిఆర్ఎస్ నాయకులు భరించలేకపోతున్నారన్నారు. మంత్రి పదవినీ అడ్డం పెట్టుకొని బాల్కొండ నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో కుల సంఘ సభ్యులను తప్పు దారి పట్టిస్తూ నిధుల పేరు మీద సంఘాలతో తీర్మానాలు చేయిస్తున్నారని, బిఆర్ఎస్ పార్టీకి ఓటేస్తేనే నిధులను మంజూరు చేస్తానని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినట్లేనని ఒక పార్టీకి ఓట్లు వేయమని, వేస్తామని చెప్పే హక్కు ప్రజాస్వామ్యంలో ఎవరికి లేదన్న సంగతి గుర్తించాలన్నారు. అధికారముందన్న మైకములో మంత్రి మర్చిపోయినట్లు ఉన్నారని విమర్శించారు. ఇలాంటి తీర్మానాలు ఆర్టికల్ 320 ప్రకారం ఓటర్లను ప్రభావితం చేయడమేనని సుప్రీంకోర్టు గతంలో పలు కేసుల్లో చెప్పడం జరిగిందన్న సంగతి మంత్రి ప్రశాంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పరిపాలనలో ఏనాడు కూడా అభివృద్ధి గురించి పట్టించుకో లేదన్నారు. ఒక నెల రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయని ఆగా మేఘాల మీద కుల సంఘాలను పిలిపించుకొని ప్రొసీడింగ్స్ ఇస్తున్నారని, మరి ఎన్నికల షెడ్యూలు విడు దలైందని ఎన్నికల కోడ్ వచ్చిన సందర్భంగా ఏ విధంగా నిధులు విడుదల చేస్తారని ప్రశ్నించారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఇకనైనా ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలన్నారు. జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బాల్కొండ నియో జకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించి తీరుతామన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకేట రవి, పడిగెల ప్రవీణ్, రేవతి గంగాధర్, బొనగిరి భాస్కర్, పాలేపు నరసయ్య, అరుణ్ రెడ్డి, కుందేటి శ్రీనివాస్, మండపల్లి మహిందర్, గడ్డం అశోక్, తిప్పిరెడ్డి కమలాకర్, నితిన్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ తీసుకువచ్చిన ఘనత నాదే

- మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి

నవతెలంగాణ-బోధన్

సాలూర ఎత్తిపోతల పథకం (లిఫ్ట్ ఇరిగేషన్) తీసుకువచ్చిన ఘనత తనదేనని మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం సాలూర మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనకు వార్డు సభ్యురాలు రమ హారతితో స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాలూర లిఫ్ట్‌తో చెరువులు నింపి రైతుల పంటలకు సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన ఏ హామీలను నెరవేర్చలేదని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆస్తులు కూడబెట్టుకున్నారు కానీ ప్రజా సమస్యలు తీర్చడంలో ఏమాత్రం శ్రద్ధ వహించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎవరికి ఏ పనులు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపిస్తే ప్రతి మహిళకు ప్రతినెల 2500/- ఆర్థిక సహాయం చేస్తామని, మహిళలకు ఉచితంగా బస్ ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, ఫించన్‌లు 4000లకు పెంచి ఇవ్వనున్నట్టు తెలిపారు. అనంతరం పెగడాపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తాహిర్, మండల అధ్యక్షులు గంగాశంకర్, నాగేశ్వరరావు, మంధర్న రవి, అల్లె రమేష్, రాహుల లక్ష్మణ్, వార్డు సభ్యులు రమ, రాజు, మాజీ ఎంపీపీ గోవిందగౌడ్, మాజీ ఎంపీటీసీ గాండ్ల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీమ్ విగ్రహ ఆవిష్కరణ



ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట గ్రామంలో ఆదివాసి సేవ నాయకపోడు సేవా సంఘం ఆధ్వర్యంలో కొమురంభీమ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కొమరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొమురం భీం చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో ఆదివాసి సేవ నాకెప్పుడు సంఘం జిల్లా అధ్యక్షులు గాండ్ల రామచంద్ర, సర్పంచ్ బండమీద జమున గంగాధర్, ఎంపిటిసి రాజకుమార్, పిఎసిఎస్ చైర్మన్, జిల్లా సేవా సంఘం బాడీ మెంబర్స్ అంజన్న, రవి, రాజేశ్వర్, విగ్రహ దాత ఎర్రం నరహరి తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత షెడ్డు నిర్మాణానికి సర్పంచ్ విరాళం

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో దుర్గమాత షెడ్డు నిర్మాణానికి సర్పంచ్ సరిన్ రూ.31116 శ్రీరాం యూత్ సభ్యులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా దుర్గామాత ఆలయ 12వ వార్షికోత్సవ సందర్భంగా తన వంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ యూత్ సభ్యులు గంగాధర్, సుమన్, ప్రనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సర్పంచ్

యూనివర్సిటీ అభివృద్ధి కోసం

ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలి

- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఎస్ఎఫ్ఐ వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీలో ఆడిటోరియం నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించాలని, పలు విద్యారంగ సమస్యలనూ పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమ తమవుతున్నదని, ప్రధానంగా సంక్షేమ వసతిగృహాలు, గురుకుల, కెజిబివి, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెస్‌ఛార్జీలు పెంచామని ప్రకటించినా అవి ఎక్కడ అమలు కావడం లేదని వాపోయారు. గత ఏడాది కాలం నుంచి హస్టల్స్ మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. గత నాలుగేళ్ల నుండి సుమారు 5,177 కోట్లు రూపాయల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయలేదని పేర్కొన్నారు. వసతి గృహ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీల ఊసేలేదని ఇలాగైతే ఎలా అని ప్రశ్నించారు. తెలంగాణ యూనివర్సిటీకి ఆడిటోరియాన్ని నిర్మించాలని, దాంతో పాటుగా విద్యార్థుల దేహదారుఢ్యం కోసం ఓపెన్ జిమ్, ఎన్‌సిసి ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆదిలాబాద్, నిర్మల్, మెదక్ కళాశాలలను తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకోవచ్చే విదంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు దినేశ్, నాయకులు చిత్రు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు..

ఆర్మూర్ : రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమతమవుతున్నదని, ప్రధానంగా సంక్షేమ వసతిగృహలు, గురుకుల, కెజిబివి, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధాల నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచామని ప్రకటించినా అవి అమలు కావడం లేదన్నారు. గత సంవత్సరకాలం నుంచి హస్టల్స్ మెస్ బిల్లులు కూడా పెండింగ్ ఉన్నాయన్నారు. నియోజకవర్గంలోని నందిపేట్ మండలం ఐలాపూర్ గ్రామంలో బాయ్స్ హాస్టల్ నిర్మించాలని, ఆర్మూర్‌లో గర్ల్స్ హాస్టల్ నిర్మించాలని, పట్టణంలో ఉన్న కేజీబీవీ వద్ద డ్రైయినేజీ సమస్య పరిష్కరించి ప్రహరీ గోడ నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న 5,177 కోట్ల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన పెంచిన మెస్ ఛార్జీలు తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జవహర్‌సింగ్ పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

- బోధన్ మున్సిపల్ కార్యాలయం ముందు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులకు రెండు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. 7 నెలల పి.ఆర్.సి వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. బోధన్ పట్టణంలోని మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మరియు వారి ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజున ఐ ఎఫ్ టీ యూ, సీ ఐ టీ యూ ల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేసి, బోధన్ మున్సిపల్ కమిషనర్ కమర్ హైమద్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐ ఎఫ్ టీ యూ రాష్ట్ర నాయకులు బి.మల్లేష్, సిఐటీయు జిల్లా కార్యదర్శి జె. శంకర్ గౌడ్ లు మాట్లాడుతూ కాంట్రాక్టు/ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ సీఎం ఇచ్చిన మాటను తప్పి, మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను మోసం చేశాడని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికైనా కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం పర్మినెంట్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నెలనెలకు జీతాలు రాక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని దసరా పండుగ వస్తున్న రెండు నెలల వేతన బకాయిలు ఇప్పటికీ ఇవ్వలేదని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పిఆర్సి వేతన బకాయిలు ఇప్పటికీ ఇవ్వలేదని వాటిని కూడా ఇవ్వాలని మరియు ఇతర సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ నాయకులు ప్రభాస్, కె.సంజీవ్, జి.రాజు, బి.గంగారాం, బి.రాజు, బి.గంగామణి, అబ్బయ్య, ఆటో డ్రైవర్లు, కార్మికులు బాలరాజు, సందీప్, సాయిబాబా, రాజకుమార్, సిబిటియు నాయకులు, కార్మికులు శివరాం, శివలింగం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పాఠశాల తాళం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం మందర్న గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల గేటు తాళం ధ్వంసం చేసి మద్యం బాటిళ్లను పాఠశాల ఆవరణలో పగులగొట్టిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరుతూ హెచ్ఎం సురేఖ, విద్యాకమిటీ చైర్మెన్ జ్ఞానేశ్వర్ సోమవారం సర్పంచ్ గంగాధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో బెల్టుషాపులలో విచ్చలవిడిగా మద్యం అమ్మడం మద్యం సేవించి వారు బాటిళ్లను మురికి కాలువలో పగులగొట్టడం, పాఠశాలలో పగులగొట్టడం చేస్తున్నారని అన్నారు. కావున తక్షణమే పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, బెల్టు షాపులను తొలగించాలని విన్నవించారు.

5

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం | అక్టోబర్ 10, 2023 | www.navatelangana.com

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలంలోని దొంచంద గ్రామంలో మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ ఆధ్వర్యంలో ఇంటింటికి సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా దోమల నిర్మూలన గురించి ప్రజలకు అవగాహన కల్పించి, లార్వాను తొలగించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మారుతి, ఎన్.సి.హెచ్.పిలు వంశీ, రాహుల్, ఏఎన్ఎంలు సుమలత, వీణ, రాజహంస, కల్పన, మహేశ్వరీ, సర్పంచ్ గడ్డె రాధ గంగారాం, పంచాయతీ కార్యదర్శి రాకేష్ పాల్గొన్నారు.

చేగువేరా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ పోరుడు చేగువేరా జీవిత స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ పోరుడు చేగువేరా 56 వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పోశమైన మహేష్ మాట్లాడుతూ.. ఎర్నెస్టో గువేరా 1928 జూన్ 14 అర్జెంటీనా దేశంలో ఎర్నెస్టో లీంచ్, సెలియా డి లా సెర్నా వై దంపతులకు జన్మించాడని అన్నారు. చేగువేరా విద్యాభ్యాసం చేస్తున్న సందర్భంలోనే ప్రజల జీవన విధానం గురించి తెలుసుకోవడం కోసం మోటార్ సైకిల్ యాత్ర పేరుతో వివిధ దేశాలను పర్యటించి అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ఏదైనా చేయాలనే ఒక ఆలోచనతో బయలుదేరి, క్యూబా దేశానికి స్వాతంత్రం వచ్చే వరకు అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. గొరిల్లా దళాలను ఏర్పాటు చేసి విజయం సాధించాడని వివరించారు. ఆ తర్వాత క్యూబా దేశంలో వివిధ శాఖల మంత్రిగా సేవలందించి, బొలీవియా దేశానికి స్వాతంత్రం తేవడం కోసం మళ్లీ ఉద్యమాల బాట పట్టి, చివరికి అమెరికా సైనికుల చేతిలో అక్టోబర్ 09 1967లో మరణించాడని తెలిపారు. అదేవిధంగా చేగువేరా ఎప్పుడూ కూడా తన గురించి కాకుండా ఇతరుల గురించి ఆలోచిస్తూ పేద ప్రజల సమస్యలను పరిష్కరించాలని, తన జీవితాన్ని కూడా త్యాగం చేసిన గొప్ప మహనీయుడని ఇలాంటి మహనీయుల జీవిత చరిత్రలు తెలుసుకొని విద్యార్థులు, యువకులు కూడా సమస్యల పరిష్కారానికి కదులుతూ ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు వాగ్మారే విశాల్, నగర కమిటీ సభ్యులు గంగ ప్రసాద్, శివ, నాయకులు మోతిలాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బీసీ బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా సావెల్ నెల్ల లింగన్న


సమావేశంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో జరిగిన బీసీ కులాల విస్తృత స్థాయి సమావేశంలో సావెల్ గ్రామానికి చెందిన నెల్ల లింగన్నను బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ మాట్లాడుతూ.. రాజకీయ కుటుంబం నుండి వచ్చిన లింగన్న గతంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా పనిచేసిన అనుభవం ఉన్న నాయకులని జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని బీసీలందరిని ఏకతాటి పైకి తెచ్చి రాజ్యాధికారం సాధించాలని ఆకాంక్షించారు. తన సర్పంచ్‌గా ఉన్న గ్రామంలో అవినీతి రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడంలో లింగన్న కృషి ఎనలేనిదని బుస్స ఆంజనేయులు అన్నారు. తనకు ఇచ్చిన ఈ బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని నూతనంగా నియామకమైన బాల్కొండ అధ్యక్షులు నెల్ల లింగన్న అన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, కరిపే రవిందర్, నారాయణరెడ్డి, శ్రీలత, ద్యాగ శేఖర్, కోడూరి స్వామి, విజయ్, సంజీవ్, బక్కన, శేఖర్ , పెద్దన్న, రవి,రంగు ప్రసాద్, యదేశ్వర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో లెర్నింగ్ లైసెన్సు, హెల్మెట్లు అందజేత


లైసెన్స్ పేపర్లు, హెల్మెట్లు పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్, కోనాపూర్ గ్రామాల్లో సోమవారం పలువురు యువకులకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో లెర్నింగ్ లైసెన్స్ పేపర్లు, హెల్మెట్లను స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ మంత్రి ప్రశాంత్‌రెడ్డి తన సొంత ఖర్చులతో డ్రైవింగ్ లైసెన్స్‌లతోపాటు ఉచితంగా హెల్మెట్‌లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. యువత మేలుకోరి ఇంత మంచి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ఎప్పటికీ మర్చిపోలేమని, ఎల్లవేళలా వారి సేవలో ఉంటామని తెలుపుతూ యువకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. యువతీ యువకుల బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు ప్రమాదాల బారిన పడకూడదన్న సదుద్దేశంతో మంత్రి ఉచితంగా హెల్మెట్లను అందించడం అభినందనీయమన్నారు. యువతీ యువకులు ప్రయాణాలు చేసేటప్పుడు హెల్మెట్లను ఉపయోగించడం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాగపూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల నాయకులు పాలెపు రవి కిరణ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సాదుల్ల రాజన్న, గ్రామ యువకులు, కోనాపూర్‌లో సర్పంచ్ దయ్య దేవయ్య, ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్, మండల ఉపాధ్యక్షులు టేకుల రాజు, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు లకావత్ సంతోష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఉత్కం నర్సాగౌడ్, ఉపసర్పంచ్ టేకుల జలంధర్, పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, జలా రాజు, రాజేందర్, రంజిత్, వంశీ, నవీన్, గ్రామ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

మాపై కరుణ చూపండి..

- ఎమ్మెల్యే బాజిరెడ్డికి ఆశాల వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశాలు

చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషిస్తున్నామని, తమపై కరుణించాలని, ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించి ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించే విధంగా చూడాలని ఆశా కార్యకర్తల మండల అధ్యక్షులు బి.స్వప్న ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశావర్కర్లకు పనిభారం విపరీతంగా పెరిగిందని, పారితోషికంతో పాటు పారితోషికాలు లేని అనేక పనులను ప్రభుత్వం ఆశాలతో చేయిస్తున్న దన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు సబ్ సెంటర్స్, బస్తీ దవాఖానాల్లో పని చేయాలని ఆశాలకు ప్రభుత్వం ఆదేశిస్తుందని, ఇంత పని చేస్తున్న ఆశాలకు కేవలం రూ.9,750/-లు పారితోషికాలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్నారని వాపోయారు. ఒకవైపు పని భారం పెరిగిందని, మరొకవైపు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వివరించారు. ఈ పరిస్థితిలో వచ్చే పారితోషికాలు సరిపోక ఆశా వర్క ర్లు అనేక ఇబ్బందులకు గురౌతున్నారని పేర్కొన్నారు. ఆశాల పారితోషికాలను రూ.18వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని అన్నారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముబారక్‌నగర్‌లో మేరా మిట్టి మేరా దేశ్


మేరామట్టి మేరా దేశ్‌లో నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

ముబారక్‌నగర్‌లో రూరల్ ఇంచార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ కులచారి ఆధ్వర్యంలో మేరా మట్టి మేరా దేశ్ కార్య క్రమం నిర్వహిం చారు. నియోజకవర్గ ఎనిమిది మండల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్, బీజేవైఎం అధ్యక్షులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం

- మంత్రికి మద్దతుగా కొనసాగుతున్న ఏకగ్రీవాల పరంపర

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


ఏకగ్రీవ తీర్మాన పత్రాలు అందజేస్తున్న దృశ్యం

అభివృద్ధి పాలనకు మెచ్చి మంత్రి ప్రశాంత్ రెడ్డికే మా ఓట్లు వేస్తామని పేర్కొంటూ కుల సంఘాల సభ్యులు చేస్తున్న ఏకగ్రీవ తీర్మానాల పరంపర కొనసాగుతుంది. సోమవారం మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన మున్నూరు కాపు, యాదవ, గంగపుత్ర, అంబేద్కర్ మాల, బంజారా సంఘాల సభ్యులు బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం అభ్యర్థి, రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి మా మద్దతు, మా ఓట్లు అని ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. ప్రశాంత్ రెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి, కోనాపూర్ గ్రామంలో చేసిన అభివృద్ధి పనులకు, మా గ్రామానికి చేసిన సేవలకు మద్దతుగా ఉంటామని పేర్కొంటూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. మమ్మల్ని వారి కుటుంబ సభ్యులుగా భావించి ఆదరిస్తున్నందుకు తామంతా ప్రశాంత్ రెడ్డి వెంట వందశాతం ఉండి అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఆయా కుల సంఘాల సభ్యులు చేసుకున్న ఏకగ్రీవ తీర్మానాల ప్రతులను జడ్పీటీసీ సభ్యురాలు రాధా రాజగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఉండాలని ఏకగ్రీవ తీర్మానాలు చేసుకున్న కుల సంఘాల సభ్యులకు గ్రామ బిఆర్ఎస్ పార్టీ తరఫున జెడ్పిటిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దయ్య దేవయ్య, ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్, మండల ఉపాధ్యక్షులు టేకుల రాజు, ఎస్టి సెల్ మండలాధ్యక్షులు లకావత్ సంతోష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఉత్కం నర్సాగౌడ్, ఉపసర్పంచ్ టేకుల జలంధర్, పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, జలా రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్గలో బతుకమ్మ చీరల పంపిణీ


బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం కొప్పర్గ గ్రామంలో సోమవారం ఉప సర్పంచ్ సయ్యద్ ఖలీల్ మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేస్తుందని అన్నారు. ప్రతి మహిళ బతుకమ్మ చీరలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం.డీ.ఖలీల్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, రైతు సమన్వయ సమితి నాయకులు రాములు, మహిళ మండలి అధ్యక్షురాలు లక్ష్మీ, అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్ సొసైటీలో క్రాప్‌లోన్లు పంపిణీ


రుణాలు పంపిణీ చేస్తున్న చైర్మెన్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం సహకార సంఘం చైర్మన్ తంబుర్ శ్రీనివాస్ చేతుల మీదుగా నూతనంగా ఎస్ఏఓ క్రాపులోన్స్ పంపిణి చేశారు. 18 మంది రైతులకు రూ.19,44,000 పంపిణీ చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు కళ్ళెం భోజరెడ్డి, బార్ల సంతోష్ రెడ్డి, కళ్ళెం సాయ రెడ్డి, సింగేడి మల్లుబాయి, ఇంగు గోవర్ధన్, అరే రాజేశ్వర్, దుదిగం ప్రమోద్ కుమార్, కట్ట నర్సయ్య, పచ్చుక లసుంబాయి, వెల్మ నర్సరెడ్డి, గొల్ల గంగాధర్, సంఘం కార్యదర్శి తొర్తి మల్లేష్, సిబ్బంది డి.ముత్యం, దేవరాజ్, గంగాధర్, గంగారాం, రాజు రైతులు పాల్గొన్నారు.

లైంగికదాడి.. ఆపై హత్య..?

- అనుమానస్పద స్థితిలో మహిళ మృతి
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నవతెలంగాణ-కంఠేశ్వర్


ఫైల్

నిజామాబాద్ నగరంలో మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని బట్టి.. మహిళపై లైంగికదాడికి పాల్పడి ఆపై హత్య చేసినట్టు తెలుస్తోంది. ఒంటరిగా ఉంటున్న మహిళ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తల్లి గురువారం నుంచి ఫోన్లో కాంటాక్ట్‌లో లేకుండా పోయిందని కూతురు సైతం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో మహిళ అనుమానస్పద మరణం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నగరంలోని హమాల్‌వాడి ప్రాంతంలో ఒక ఇంట్లో అద్దెకుంటున్న లలితా బాయి (50) తాను అద్దెకు ఉంటున్న ఇంట్లోనే హత్యకు గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు లలిత భాయి పై అత్యాచారం చేసి హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. లలిత భాయ్ పై అఘాయిత్యాన్ని ఒడిగట్టిన అగంతకులు ఇంటికి బయట నుంచి తాళం వేయడంతో ఈ విషయం ఐదు రోజులు గడిచినా వెలుగులోకి రాలేదు. సోమ వారం మధ్యాహ్నం పోలీసులు ఇంటి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించేసరికి లలితా బాయి ఒంటిపై ఎలాంటి బట్టలు లేవని గుర్తించారు. బోధన్ పట్టణం బెల్లాల్‌కు చెందిన లలితా బాయ్ భర్త మృతి చెందడంతో ఇద్దరు పిల్లలతో కలిసి హమాల్వాడి చౌరస్తాలో ఒక ఇంట్లో అద్దెకుంటూ అక్కడక్కడ పనిచేసి కుటుంబాన్ని నెట్టుకొచ్చేది. కూతురు రేఖకు వివాహం జరిపించింది. ఏకైక కుమారుడు ఉపాధి నిమిత్తం మలేషియా వెళ్ళినట్టు తెలిసింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గత గురువారం నుంచి తన తల్లి ఫోన్ లేపకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. లలితా బాయి మృతదేహం కుళ్ళిపోయిన స్థితికి చేరుకోవడంతో గురువారమే ఆమెపై అఘాయిత్యం చేసి, హత్య చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటన స్థలాన్ని పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు.


మృతురాలి ఇంటి వద్ద పోలీసులు

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు ధర్మారం విద్యార్థిని ఎంపిక


ఎంపికైన విద్యార్థికి అభినందన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-17 ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఖోఖో ఎంపికలో డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం.బి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల క్రీడాకారిని ఏ.అంకిత చక్కని ప్రతిభ కనబరిచి ఈ నెల 13 నుంచి 15 వరకు వనపర్తిలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగీత పాల్గొని మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటలలో రాణించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఖోఖో పోటీలకు ఎంపికైన అంకితను, ఇందుకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ నీరజరెడ్డి, పిఈటి జ్యోత్స్న, హౌస్‌టీచర్ దమయంతిని ప్రిన్సిపాల్ సంగీత అభినందించారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ దంపతులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ చెప్యాల రజిత గంగరాజం మద్దతుదారులతో కలిసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమవారం గ్రామంలో జడ్పీటీసీ సభ్యురాలు పెరుమాండ్ల రాధా రాజగౌడ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి జడ్పిటిసి పార్టీ కండువా కప్పి సాధారంగా బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ దంపతులు మాట్లాడుతూ.. కోనాపూర్ గ్రామంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గత తొమ్మిది సంవత్సరాల నుండి చేస్తున్న అభివృద్ధికి, వారు చేస్తున్న సేవ కార్యక్రమాలకు మద్దతుగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీ, కేసిఆర్ మాత్రమే సాధ్యమన్నారు. ప్రతిక్షణం నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షించే మంత్రి ప్రశాంత్‌రెడ్డి లాంటి మంచి నాయకునికి మద్దతుగా ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దయ్య దేవయ్య, ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, సింగిల్ విండో చైర్మన్ బడాల రమేష్, మండల ఉపాధ్యక్షులు టేకుల రాజు, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు లకావత్ సంతోష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఉత్కం నర్సాగౌడ్, ఉపసర్పంచ్ టేకుల జలంధర్, పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, జలా రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఇతర రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ, అదనపు కలెక్టర్ లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి లతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు - 2023 కు షెడ్యూల్ విడుదల చేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, 24 గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాలలో వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫోటోలు, వాల్ రైటింగ్స్ తొలగించాలని, 48 గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలు ఫోటోలు తొలగించాలని, ప్రైవేట్ స్థలాలో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫోటోలను 72 గంటల్లో తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి అదే రోజు అందించే విధంగా ఎంసిఎంసి పని చేయాలని అన్నారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.